సాక్షి
ప్రకాశం

బుధవారం । 29 । జనవరి । 2025



తెలుగు తమ్ముడి దారి దోపిడీ

మర్రిపూడి గార్లపేట గ్రామంలో రూ.50 లక్షల విలువైన వంక పోరంబోకు భూమిని టీడీపీ నేత పువ్వాడ సుబ్బారావు కబ్జా చేసి తన స్వాధీనంలో ఉంచుకున్నాడు. - 8లో..



రూ.3 కోట్ల స్థలం గిఫ్ట్‌డీడ్‌తో స్వాహా!

యర్రగొండపాలెంలో రూ.3 కోట్ల విలువైన స్థలాన్ని అప్పనంగా కాజేసేందుకు ఒకడు పథకం రచించాడు. అందుకు అధికారులు సహకరించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
31/20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అందుకు సంబంధించిన సమగ్రమైన సమాచారాన్ని అందచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో డీఆర్‌సీ సమావేశం ఉన్న నేపథ్యంలో మంగళవారం ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో గత డీఆర్‌సీలో ప్రస్తావించిన అంశాలపై తీసుకున్న చర్యలపై సమీక్షించారు. వచ్చే సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సిద్ధంగా రావాలని ఆదేశించారు. ఇప్పటి నుంచే క్షేత్రస్థాయి సిబ్బంది సమీక్షలు నిర్వహించి సమగ్రమైన సమాచారం అందుబాటులో ఉంచాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ చిన ఓబులేసు, సీపీఓ వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ఒంగోలు వన్‌టౌన్: దొనకొండ మండలం రుద్ర సముద్రం గ్రామానికి చెందిన గిరిజనులు మాట వెంకటేశ్వర్లు, అతని భార్య శివమ్మపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన మల్లిఖార్జున్ అనే వ్యక్తి భార్య.. వెంకటేశ్వర్లు ఆటోలో వెళ్లి సెల్ ఫోన్ కొనుగోలు చేసుకుంది. అయితే మల్లిఖార్జున్ అడిగిన సమయంలో తాను కొని ఇచ్చాడని చెప్పడంతో అతను మరో 18 మంది అగ్రకులస్థులను తీసుకుని వచ్చి తమ దాడి చేసి, తమ ఆటోను, మోటార్ సైకిళ్లను, తగుల బెట్టారని వెంకటేశ్వర్లు వాపోయారు. మల్లిఖార్జున్ భార్యతో తమపై కేసు పెట్టించారని, నిందితులను అరెస్టు చేసి తమకు న్యాయ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వాలి

- టీచర్స్ గిల్డ్ డిమాండ్

ఒంగోలు సిటీ:

ఎయిడెడ్ ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై డీఈఓ స్పష్టత ఇవ్వాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్.ప్రభాకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో కోర్టుకు వెళ్లిన యాజమాన్యాలకు జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను డీఈఓ కార్యాలయ సిబ్బంది ఆ పాఠశాలలకు ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను పంపుతున్నారన్నారు. ఆ యాజమాన్యాలు వారిని పాఠశాలల్లో చేర్చుకోవడం లేదన్నారు. జనవరి 9న పాఠశాల చివరి పని దినం రోజు యర్రగొండపాలెం డీఎంబీసీ ఎయిడెడ్ పాఠశాల నుంచి నలుగురు ఉపాధ్యాయులను కొమరోలు మండలం, ఎస్.బి.ఎస్.ఆర్ సంస్థలకు, ముండ్లపాడు సెయింట్ జాకబ్ సంస్థకు పంపారన్నారు. ఆ యాజమాన్యాలు ఉపాధ్యాయులను చేర్చుకోలేదని, అదే విధంగా చీరాల నుంచి జేపంగులూరు మండలం, రామ్‌పూర్ ఎయిడెడ్ పాఠశాల నుంచి పర్చూరు మండలం, చెరుకూరు ఎయిడెడ్ పాఠశాలకు ఉపాధ్యాయులను పంపించినప్పటికీ ఆ యాజమాన్యాలు చేర్చుకోలేదన్నారు. జనవరి 18వ తేదీ డీఈఓ ఆర్డర్‌తో 27వ తేదీ ఒక మహిళా టీచర్‌ను చీమకుర్తి మండలం, ఎల్ రాజుపాలేనికి దర్శి మండలం, కృష్ణాపురం ఎయిడెడ్ పాఠశాల నుంచి రిలీవ్ చేసి పంపేందుకు మండల విద్యాశాఖ సిద్ధంగా ఉన్నా ఎల్.రాజుపురం యాజమాన్యం ఆ ఉపాధ్యాయురాలిని పాఠశాలలో చేర్చుకోకపోతే పరిస్థితి ఏ విధంగా ఉంటుందో జిల్లా విద్యాశాఖ సిబ్బందికి తెలుసన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించి శాశ్వతంగా మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని కోరారు.

చిరు బతుకులు విధ్వంసం..



కూరగాయల షాపుల పైకప్పులు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది





దుకాణంలో బల్లపై పడుకుని నిరసన తెలుపుతున్న వ్యాపారి



మహిళా వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఆర్‌ఐ

క్షణాల్లో దుకాణాలను నేలమట్టం చేసిన కార్పొరేషన్ అధికారులు

కన్నీరుమున్నీరైన కూరగాయల వ్యాపారులు

తెల్లవారుఝాము నుంచే కష్టపడితే కానీ పూట గడవని పరిస్థితి వారిది. ఒకపక్క మంచు కురుస్తోంది..మరో పక్క చలిగాలి వణికిస్తోంది.. తాజా కూరగాయలు తెచ్చుకుని దుకాణాలు సర్దుకుంటున్నారు..మార్కెట్‌లో ఒక్కసారిగా అలజడి..వందలాది మంది పోలీసులు, అధికారులు కర్కశంగా దాడి చేశారు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు కూరగాయలు లోపల ఉండగానే దుకాణాలు నేలమట్టం అయ్యాయి. లోపల పచ్చి సరుకుంది సారూ.. ఆగండని వేడుకుంటున్నా నిర్దయగా దుకాణాలు కూల్చివేశారు. మార్కెట్ ధ్వంస రచనకు అధికారులు చెబుతున్న కారణమేమిటంటే కరోనా సమయంలో వీరు చెల్లించాల్సిన అద్దె బకాయిలు చెల్లించలేదంట. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వ్యాపారులను రోడ్డున పడేశారు. వినియోగదారులు వచ్చే సమయంలో కాలయముల్లా వచ్చి సుమారు రూ.కోటిన్నర సరుకు మట్టిపాలు చేశారు. న్యాయం కోసం మార్కెట్ ముందు ధర్నా చేశారు, కలెక్టరేట్ వద్దకు వెళ్లారు. అయినా వారి వేదన అరణ్యరోదనగానే మిగిలిపోయింది. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఒంగోలు కూరగాయల మార్కెట్ చరిత్రలో బ్లాక్ డేగా నిలిచిపోయిందని నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- రణరంగాన్ని తలపించిన ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్
- నోటీసులివ్వకుండా పోలీసులతో కలిసి నగర పాలక సంస్థ అధికారుల జీభత్సం
- ముప్పేట దాడిలో 200కు పైగా దుకాణాలు ధ్వంసం
- రూ.కోటిన్నర విలువైన కూరగాయలు, ఆకుకూరలు మట్టిపాలు
- వ్యాపారులు ప్రాధేయపడుతున్నా కనికరం లేకుండా దుకాణాలు కూల్చివేత
- కరోనా సమయం నాటి బకాయిలు, వడ్డీ చెల్లించకపోవడమే కారణమట
- రాజకీయ కక్షతోనే దుకాణాలు పెకలించారని వ్యాపారుల మండిపాటు
- తమ ఉసురు పోసుకుంటారంటూ బాధితుల శాపనార్థాలు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో దాదాపు 70 హోల్‌సేల్ షాపులు, 123 రిటైల్ దుకాణాలు, కింద పెట్టుకొని ఏరోజుకారోజు పొట్ట పోసుకునే మరో 100 మందికి పైగా చిరు వ్యాపారులు కూరగాయలు, కిరణా సరుకులు విక్రయిస్తుంటారు. దాదాపు 18 సంవత్సరాల నుంచి ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పుడూ కూరగాయల వ్యాపారులు, కొనుగోలుదారులతో సందడిగా ఉండే ఈ మార్కెట్‌పై మంగళవారం ఒక్కసారిగా నగరపాలక సంస్థల అధికారులు విరుచుకుపడ్డారు. పోలీసు బలగాలతో తరలి వచ్చి భీతావహ వాతావరణాన్ని సృష్టించారు.

కరోనా సమయంలో బాడుగ చెల్లించలేదంటూ..

కరోనా సమయంలో దుకాణాలకు బాడుగలు చెల్లించలేదని కార్పొరేషన్ అధికారులు దుకాణాలు కూల్చివేత కారణంగా చెబుతున్నారు. చిన్న వ్యాపారులన్న కనికరం లేకుండా రూ.లక్షలకు లక్షలు బకాయిలు ఉన్నారంటూ లెక్కలు చూపిస్తూ దుకాణాలను నేలమట్టం చేశారు. చిన్న దుకాణదారులు రూ.రెండు లక్షలు బకాయిలు ఉంటే వడ్డీ, జీఎస్టీ కలుపుకుని రూ.ఆరు లక్షలు, హోల్‌సేల్ దుకాణదారుల బకాయిలు రూ.5 లక్షలు ఉంటే వడ్డీ, జీఎస్టీ కలుపుకుని రూ.11 లక్షలు బకాయిలు చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారులకంటే దారుణంగా లెక్కలు చూపిస్తూ దుకాణాలను ధ్వంసం చేశారు. గతంలో తాము చెల్లిస్తామన్నా కట్టించుకోకుండా నేడు ఇలా దుకాణాలు కూల్చివేయడమేమిటని అధికారులను వారు నిలదీస్తున్నారు.

వడ్డీ మాఫీ చేస్తామని ఎన్నికల్లో చెప్పి మరీ...

గత అసెంబ్లీ ఎన్నికల్లో కరోనా సమయంలో చెల్లించాల్సిన బాడుగ బకాయిలకు సంబంధించిన వడ్డీ మాఫీ చేస్తామంటూ టీడీపీ నాయకులు నమ్మబలికారు. అదే వాగ్దానంతో మార్కెట్‌లోని వ్యాపారులను, చిరువ్యాపారులను, కూలీలను నమ్మించి ఓట్లు వేయించుకున్నారు. చింతలకు చెందిన టీడీపీ సానుభూతిపరుడైన ఒక కానిస్టేబుల్ వచ్చి టీడీపీకి ఓట్లేయిండి అంటూ అడిగారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

అధికారుల పక్షపాతం..

అధికారులు మాత్రం పక్షపాత ధోరణిని బయట పెట్టుకున్నారు. వందల సంఖ్యలో దుకాణాలను ధ్వంసం చేసిన అధికారులు టీడీపీకి చెందిన విష్ణువర్దన్ అనే అతని షాపు జోలికి మాత్రం వెళ్లలేదు. ఆ షాపుతో పాటు పక్కనే టీడీపీ వారి షాపు జోలికి కూడా వెళ్లలేదు. మార్కెట్ మొత్తం రోదనలతో, హాహాకారాలతో మిన్నంటుతుంటే విష్ణు వర్దన్ షాపులో మాత్రం కూరగాయలు విక్రయించుకున్నాడు. చివరకు మిగతా షాపుల వాళ్ళు పోలీసులను నిలదీయడంతో మధ్యాహ్నం 11 గంటలకు పోలీసులు దగ్గరుండి దుకాణదారునితో కూరగాయలు అక్కడ నుంచి సర్దుకునేలా వెసులుబాటు కల్పించారు. కనీసం దుకాణం పైన ఉన్న పట్టను కూడా తొలిగించలేదు.పోలీసులు ఆ దుకాణానికి రక్షణగా ఉండిమరీ కూరగాయలు సర్దుకునేలా చేసి స్వామి భక్తిని చాటుకున్నారు..



తన దుకాణం తొలగించడంతో రోదిస్తున్న వృద్ధురాలు

రూ.కోటిన్నర పచ్చి సరుకు నేలపాలు...

ఎప్పటిలాగే మార్కెట్‌లో వ్యాపారులు తెల్లవారుజామున నాలుగు గంటలకు మార్కెట్‌కు వచ్చి అప్పటికే ఉన్న కూరగాయలతో పాటు మరి కొన్ని తాజా కూరగాయలు తెచ్చుకొని దుకాణాలు సర్దుకుంటున్నారు. అంతా సిద్ధం చేసుకుని వినియోగదారుల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో వినియోగదారులకు బదులుగా కాలయముళ్లా దుకాణాలపై విరుచుకుపడ్డారు కార్పొరేషన్ అధికారులు. పోలీసులు, నగర పాలక సంస్థ అధికారులు చేసిన విధ్వంసకర సంఘటనతో మొత్తం రూ.కోటిన్నర పచ్చి సరుకు నేలపాలు అయిందంటూ బాధితులు లబోదిబోమంటున్నారు. ఒక్కో దుకాణంలో రూ.10 వేలు మొదలుకొని రూ.50 వేల వరకు సరుకు ఉంటుందని, అది మొత్తం మట్టిపాలు చేశారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్నామని ముందస్తు సమాచారం లేకుండా వచ్చి దుకాణాలను ధ్వంసం చేయటం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు. ఎండనకా..వాననకా..



దుకాణాల తొలగింపును అడ్డుకుంటున్న వ్యాపారులు

రోడ్డుపై ఏరోజుకారోజు కూలీ సంపాయించుకొని కుటుంబాన్ని పోషించుకునే చిరు వ్యాపారులను కూడా వదలకుండా కూరగాయలు, ఆకుకూరలు మట్టి, బురద పాలు చేశారంటూ విలపిస్తున్నారు.

కూరగాయలు దహనం చేసి నిరసన...

పోలీసులు, ఒంగోలు నగర పాలక సంస్థ సిబ్బంది, అధికారులు చేస్తున్న దౌర్జన్యానికి నిరసనగా మార్కెట్‌లోని కూరగాయల వ్యాపారులు ధ్వంసం చేసిన దుకాణాల పట్టలు, తడికలు తీసుకొచ్చి మార్కెట్ మధ్యలో వేసి వాటికి నిప్పంటించారు. ఆ మంటల్లో కూరగాయలు కూడా వేసి దహనం చేశారు. మా కడుపులు కొట్టి.. మా ఉసురుపోసుకుంటారంటూ శాపనార్థాలు పెట్టారు. పేదల కడుపుకొడితే ఆ పాపం ఊరికే పోదంటూ కడుపుమంటతో రగిలిపోయారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనింది.

రాజకీయ కక్షసాధింపులో భాగంగానే..

ఇది రాజకీయ కక్షసాధింపేనని బాధితులు వాపోతున్నారు. మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్‌తో పాటు చిరు వ్యాపారులు మొత్తం 293 మందికి పైగా వ్యాపారాలు సాగిస్తుంటారు. అందులో 90 శాతానికి పైగా వైఎస్సార్ సీపీ సానుభూతి పరులే. మార్కెట్‌మీద పూర్తి స్థాయిలో పట్టుసాధించేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కావాలని ఈ విధంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ బాధితులు వాపోతున్నారు. వ్యాపారులను బెదిరించి టీడీపీలోకి లాక్కోవాలనే ఈ పన్నాగం పన్నారంటూ విలపిస్తున్నారు.



శాపనార్థాలు పెడుతున్న మహిళా వ్యాపారి

కలెక్టరేట్ వద్ద ధర్నా...

దుకాణాలను ధ్వంసం చేసినందుకు నిరసనగా బాధితులు మార్కెట్ నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను కలిసేందుకు పూనుకున్నారు. అయితే పోలీసులు అందుకు అంగీకరించకపోవటంతో మెయిన్ గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అధికారులకు, అధికార పార్టీ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధితులకు సీఐటీయూ జిల్లా కమిటీ పూర్తి స్థాయి మద్దతు ప్రకటించింది. సీఐటీయూ నాయకులు చీకటి శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారులు, అధికార పార్టీ నాయకులు కలిసి కూరగాయల వ్యాపారులను వేధించటం మానుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో కూరగాయలు అమ్మి ప్రజలను కాపాడిన వ్యాపారులను అద్దెబకాయిల పేరుతో వేధించటం సరైన పద్ధతి కాదని ధ్వజమెత్తారు. ఒక్కొక్క వ్యాపారికి రూ.2 లక్షలకు పైగా వడ్డీ, రూ.70 వేలు జీఎస్టీ విధించటం కాబూలి వడ్డీకంటే దారుణంగా ఉందని మండిపడ్డారు. కూరగాయల వ్యాపారులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమేష్, పురిణి ప్రభావతితో పాటు కూరగాయల వ్యాపారులు నూనె సురేష్, వి.సుబ్బారెడ్డి, నూనె సునీల్, గంగాడి శ్రీనివాసులు, చినెకల రామయ్యతో పాటు వ్యాపారులు పాల్గొన్నారు.



మధ్యాహ్నం 11 గంటలకు టీడీపీ సానుభూతి పరుడు విష్ణువర్దన్ దుకాణం పైన పట్టలు తొలిగించకుండా కూరగాయలు సర్దుకునేందుకు రక్షణగా ఉన్న పోలీసులు



కూరలు దహనం చేసి నిరసన తెలుపుతున్న వ్యాపారులు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న చిరువ్యాపారులు

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

- వీవోఏల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్
- రెండో రోజు కొనసాగిన ధర్నా

ఒంగోలు సిటీ: వీవోఏల సమస్యల పరిష్కారం కోరుతూ రెండో రోజు ధర్నా నిర్వహించినట్లు వీవోఏల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు డీఆర్‌డీఏ పీడీ ఆఫీసు వద్ద ధర్నా చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ మాట్లాడుతూ వీవోఏల ఆరు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తొలగించిన వీవోఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా సెర్ప్ అధికారులు వీవోఏల మీద హుకుం జారీ చేస్తున్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ వీవోఏ లు తొలగించిన వారు కోర్టుకు వెళితే అధికారులు ఎలాంటి జోక్యం చేసుకోరాదని, కోర్టు ఆర్డర్ ఉంటే దానిని బుట్ట దాఖలు చేస్తున్నారన్నారు. ఒక్కొక్క వీవోఏ కాళ్లు అరిగేలా కలెక్టరేట్ వద్దకు వచ్చి కలెక్టరు ను కలిశారని, అయినా ఫలితం దక్కలేదన్నారు. కార్యక్రమాలకు వస్తుంటే బెదిరింపులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో పోరాటం తప్ప వేరే మార్గం లేదని వీవోఏ లకు పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు 15 సంఘాల లోపు ఉన్న వీవోఏ లకు వేతనాలు చెల్లించలేదన్నారు. ఉపాధి కోల్పోయిన ప్రతి ఉద్యోగికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. అనంతరం పీడీ ఆఫీసు ఏవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆనంద్, బెహరనా, ఫ్లోరా తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం వద్ద రెండో రోజు ధర్నా చేస్తున్న వెలుగు వీవోఏలు

వలస విద్యార్థుల పేర్ల మూకుమ్మడి తొలగింపు తగదు

- ఏపీటీఎఫ్ సంఘం

ఒంగోలు సిటీ:

జీవో నంబరు 117 రద్దు పేరుతో జీవనోపాధి కోసం తాత్కాలికంగా తల్లిదండ్రులతో వలసవెళ్లిన విద్యార్థుల పేర్లను పాఠశాలల నుంచి మూకుమ్మడిగా తొలగించడం సరైంది కాదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జనార్ధనరెడ్డి, డి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 117 జీవో రద్దు వల్ల 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కలపడం, రెండు మాధ్యమాల ద్వారా విద్యాబోధన, ప్రధానోపాధ్యాయులను తొలగించిన పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు, పీఈటీ పోస్టులు మంజూరు చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా జరగడం సరికాదన్నారు. బోగస్ రోల్ ను ఉపాధ్యాయులు ఎవరూ సమర్థించరని, దాని పేరుతో పేర్లు తొలగించడం సహేతుకంగా లేదన్నారు. ఎప్పటిలాగే ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలను కొనసాగిస్తూ విద్యార్థులకు విద్యను దూరం చేయకుండా ఉండాలన్నారు. ఫ్యాప్టో చూపించిన మార్గంలోనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రాథమిక పాఠశాలలు, ఫౌండేషన్ స్కూల్స్, ఉన్నత పాఠశాలలు విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఉండాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను, సరెండర్ లీవ్స్ ను, పీఎఫ్ లోన్లు, క్లోజర్లు, ఏపీజీఎల్ఐ లోన్లు వెంటనే చెల్లించాలని ఐఆర్ ప్రకటించి, 12వ పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలి

- డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు



పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశం నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు అర్బన్: గత ఏడాది నవంబర్‌లో ప్రారంభించిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు లక్ష్యం మేరకు పూర్తి చేయాలని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు, ఏఎన్ఎంలతో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించి మిగిలి ఉన్న పరీక్షలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్‌సీడీ 3.0 యాప్ ప్రకారం ఆన్‌లైన్‌లో అన్నీ వివరాల అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో ఏవైనా లోపాలు ఉంటే సపోర్టు ఇంజినీర్‌ను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలన్నారు. దీనిలో నోడల్ అధికారి డాక్టర్ భగీరథి, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, ఏపిడమాలజిస్ట్ విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కాన్ సెంటర్ల తనిఖీ

డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు మంగళవారం నగరంలోని పలు ప్రైవేట్‌స్కాన్ సెంటర్లను తనిఖీ చేశారు. నిబంధనలు పాటిస్తూ విధిగా రిజిస్టర్ చేసుకోవాలని స్కాన్ సెంటర్ల నిర్వాహకులకు సూచించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్‌లు చట్టం ప్రకారం అర్హులైన డాక్టర్లతో నిర్వహించాలన్నారు. డాక్టర్ల వివరాలు డిస్‌ప్లేలో ఉంచాలన్నారు. లింగ నిర్ధారణ చెప్పబడదు అనే బోర్డులు కూడా ఏర్పాటు చేయాలన్నారు. స్కానింగ్ తర్వాత వివరాలు ప్రతి రోజు ఫామ్ ఎఫ్‌లో నమోదు చేసి పీసీపీఎన్‌డీటీ వెబ్‌పోర్టల్‌లో నింపాలన్నారు. దీనిలో మాస్‌మీడియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ కడుపులో 15 కేజీల కణితి

● ఆపరేషన్ చేసి తొలగించిన 'కిమ్స్' వైద్యులు

ఒంగోలు అర్బన్: ఓ మహిళ కడుపులో 15 కేజీల పరిమాణంలో ఉన్న కణితిని ఒంగోలులోని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేసి తొలగించినట్లు మెడికల్ డైరెక్టర్ శ్రీహరిరెడ్డి, సీఓఓ అంకిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 ఏళ్ల వయసున్న మహిళ వారం రోజుల క్రితం వాంతులు, కడుపు నొప్పి, పొట్ట ఉబ్బరంతో కిమ్స్‌కు రాగా గ్యాస్ట్రో లాప్రోస్కోపి సర్జన్ డాక్టర్ కార్తీక్‌బాబు, గైనకాలజిస్ట్ సుజని వైద్య పరక్షలు చేసి కణితిని గుర్తించారని పేర్కొన్నారు. విజయవంతంగా ఆపరేషన్ చేసి కణితిని తొలగించినట్లు తెలిపారు. ఆపరేషన్ డాక్టర్ల బృందంలో ఇమ్రాన్, రామకృష్ణ, అనూష కూడా ఉన్నట్లు తెలిపారు.

కోత, కుట్లు లేకుండా వెయిట్ లాస్

అధిక బరువు ఉండే వారికి ఎటువంటి కోత, కుట్లు లేకుండా బరువు తగ్గించే ప్రక్రియను విజయవంతం చేసినట్లు అరవింద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ నరేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. 27 ఏళ్ల యువకుడు 165 కేజీల బరువుతో ఇబ్బంది పడుతూ ఆసుపత్రికి వచ్చారని తెలిపారు. ఆ యువకుడికి ఎటువంటి కోత లేకుండా ఎండోస్కోపిక్ ఇంట్రాగ్యాస్ట్రిక్ బెలూన్ ద్వారా 6 నెలల్లో 56 కేజీల బరువు తగ్గించి 109 కేజీలకు తీసుకొచ్చామని వివరించారు. సమావేశంలో ఆసుపత్రి వైద్యులు భానుతేజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలను త్వరలో పట్టుకుంటాం

టంగుటూరు: దొంగతనం చేసిన దుండగులను త్వరలో పట్టుకుంటామని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. టంగుటూరులో ఆదివారం మూడు ఇళ్లలో జరిగిన దొంగతనాలు విషయం తెలిసిదే. అయితే దొంగలను త్వరలో పట్టుకుంటామని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అన్నారు. ఈసందర్భంగా చోరీ జరిగిన ఇళ్లు, పరిసరాలను మంగళవారం డీఎస్పీ పరిశీలించారు. బీరువాలు, ధ్వంసమైన తలుపులు, పక్కన ఉన్న ఇళ్లల్లో ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.



జగనన్న లేఔట్‌లోకి ప్రవేశించేందుకు వీల్లేకుండా తీసిన కందకాలు



గార్లపేటలోని జగనన్న లేఔట్ నివేశన స్థలాల్లో అనుమతి లేకుండా తీసిన కందకాలు

తెలుగు తమ్ముడి దారి దోపిడీ..!

- గార్లపేటలో రూ.50 లక్షల విలువైన వంక పోరంబోకు భూమి కబ్జా
- పక్కనే జగనన్న లేఔట్‌లో అనుమతి లేకుండా విచక్షణా రహితంగా కందకాలు
- నివేశన స్థలాల్లో తవ్విన మట్టితో ఆక్రమిత భూమి చదును
- మంత్రి స్వామి అండ ఉందని ఫిర్యాదుకు జంకుతున్న పేదలు
- ఏమీ తెలియనట్టు నిద్ర నటిస్తున్న అధికారులు

మర్రిపూడి: గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాటన పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్న టీడీపీ ముఖ్య నేతల మాటలు బూమరాంగ్ అవుతున్నాయి. గడిచిన ఏడు నెలలుగా గాడి తప్పి బరితెగిస్తున్న తెలుగు తమ్ముళ్లను ఓ గాటన పెట్టాలని జనం దుమ్మెత్తి పోస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని చెప్పుకుంటున్న కూటమి నాయకులు.. మట్టి, ఇసుక, భూములు, నిధుల దోపిడీలో చెలరేగిపోతున్న తీరుపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా మర్రిపూడి మండలంలోని గార్లపేట గ్రామంలో టీడీపీ నేత భూదందా బయటకొచ్చింది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పువ్వాడ సుబ్బారావు సుమారు రూ.50 లక్షల విలువైన వంక పోరంబోకు భూమిని కబ్జా చేసి తన స్వాధీనంలో ఉంచుకున్నాడు.

గార్లపేట గ్రామంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇళ్లు లేని నిరుపేదల కోసం సర్వే నంబర్ 393–2లో 167 గృహాలు మంజూరు చేశారు. జగనన్న లేఔట్‌లో గృహాల నిర్మాణం దాదాపు 80 శాతం పూర్తయింది. ఆర్థిక పరిస్థితి సహకరించక దాదాపు 20 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. ఈ లేఔట్‌కు ఉత్తరం వైపున సర్వే నంబరు 387లో వంక, బండిదారి పోరంబోకు భూమి ఎకరా విస్తీర్ణంలో ఉంది. దాదాపు రూ.50 లక్షల విలువైన ఈ భూమిపై టీడీపీ నేత పువ్వాడ సుబ్బారావు కన్ను పడింది. అనుకున్నదే తడవుగా భూమి ఆక్రమించాడు. జగనన్న లేఔట్‌లోని ఖాళీ స్థలాల్లో అనుమతి లేకుండా మట్టిని తవ్వి కబ్జా చేసిన భూమిని చదును చేస్తున్నాడు. లేఔట్‌లోకి లబ్ధిదారులు ప్రవేశించే అవకాశం లేకుండా కందకాలు తీసి వారి హక్కులను కాలరాశాడు. 5 అడుగుల లోతు, 50 అడుగుల పొడవున ఇష్టారీతిగా గోతులు తీయడంతో లేఔట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.



టీడీపీ నేత ఆక్రమించిన వంక పోరంబోకు భూమి

మంత్రి అండతోనే..

రాష్ట్ర మంత్రి డీబీవీ స్వామి ఇలాకాలో యథేచ్ఛగా సాగుతున్న భూ దందాలను చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. కబ్జాలకు తెగబడుతున్న తెలుగు తమ్ముళ్లకు మంత్రి అండదండలు మెండుగా ఉన్నట్లు జోరుగా ప్రచారం నడుస్తోంది. జగనన్న లేఔట్ స్థలాల్లో కందకాలు, పోరంబోకు భూమి ఆక్రమణపై ప్రశ్నిస్తే ఎక్కడ అక్రమ కేసులు బనాయిస్తారోనని లబ్ధిదారులు జంకుతున్నారు. అధికారులు స్పందించి గ్రామానికి చెందిన వంక పోరంబోకు, బండిదారి పోరంబోకు భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేఔట్‌లో అనుమతి లేకుండా తీస్తున్న కందకాలను వెంటనే నిలిపివేయాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

టీడీపీ నేత భూఆక్రమణపై గార్లపేట పంచాయతీ కార్యదర్శి నరసింహారావును 'సాక్షి' వివరణ కోరగా.. 'జగనన్న లేఔట్‌లో ఎలాంటి అనుమతి లేకుండా కందకాలు తీస్తున్న మాట వాస్తవమే. ఈ విషయంపై సదరు నాయకుడిని ప్రశ్నించే స్థాయి నాకు లేకపోవడంతో రెవెన్యూ అధికారులకు విషయం తెలియజేశా' అని చెప్పారు. అయితే వంక పోరంబోకు భూమి ఆక్రమణ విషయం ఇంకా తన దృష్టికి రాలేదని తహసీల్దార్ జ్వాలా నరసింహారావు చెప్పడం కొసమెరుపు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మద్దిపాడు: అతివేగంగా వెళుతూ ముందు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొని తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం సాయంత్రం గుండ్లాపల్లి ఫ్లై ఓవర్ వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ శివరామయ్య తెలిపిన వివరాల ప్రకారం జే పంగులూరు మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన సింగారపు వెంకటేష్ అనే వ్యక్తి బైక్‌పై ఒంగోలు నుంచి స్వగ్రామం వెళ్తూ గుండ్లపల్లి ఫ్లై ఓవర్ పై గ్రానైట్ లోడుతో వెళుతున్న లారీని వెనకనుంచి ఢీకొట్టాడు. దీంతో మోటార్ సైకిల్ ముందు చక్రం.. లారీ వెనక టైర్ల మధ్య ఇరుక్కుపోయింది. ఈ క్రమంలో వెంకటేష్ ఎడమ కాలు లారీకి, మోటార్ బైకుకు మధ్య ఇరుక్కుపోయింది. ఎస్ఐ శివరామయ్య ఫైర్ డిపార్ట్‌మెంట్ వారికి సమాచారం అందించడంతో వారి సిబ్బంది లారీ కి సంబంధించి రేకులను మోటార్ సైకిల్ ను కట్టర్లతో కత్తిరించారు. గాయపడిన వెంకటేష్‌ను హైవే అంబులెన్స్ ద్వారా ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురైన వెంకటేష్ ను బయటకు తీస్తున్న దృశ్యం

రూ.3 కోట్ల స్థలం.. గిఫ్ట్ డీడ్‌తో స్వాహా!

- భూమి ఒకరిది.. గిఫ్ట్ డీడ్ చేసింది సోదరుడు!
- గిఫ్ట్ డీడ్ చేసిన వ్యక్తి అదే రోజు మృతి
- తప్పుడు రిజిస్ట్రేషన్‌కు అధికారులు సహకరించారని అనుమానాలు
- అక్రమ బాగోతంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

యర్రగొండపాలెం: నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెంలో రూ.3 కోట్ల విలువైన స్థలాన్ని అప్పనంగా కాజేయడానికి ఒకడు పథకాన్ని రచించాడు. అందుకు అధికారులు పెద్ద మొత్తంలోనే డబ్బులు దండుకొని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి సహకరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ పంచాయితీ మంగళవారం పోలీసుల వద్దకు చేరింది. వివరాలు.. స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు సమీపంలో హైవే పక్కన సర్వే నంబర్ 58/1లో వెల్లంపల్లి సాయిబాబు పేరుతో 360 చదరపు గజాలు, అతని కుమారుడు తిరుమలరావు పేరుతో 253 చదరపు గజాల స్థలం ఉంది. సాయిబాబు దాదాపు 30 ఏళ్ల క్రితం ఆ స్థలంలో గృహాన్ని నిర్మించుకున్నారు. కొన్నేళ్ల తర్వాత అతను మృతి చెందారు. సాయిబాబు కుమారుడు తిరుమలరావు తన కుటుంబంతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. అతని తమ్ముడు బ్రహ్మాజీ అప్పుడప్పుడు యర్రగొండపాలెం వచ్చి వెళ్తుండేవాడు. కానీ అతని పేరుపై ఎలాంటి ఆస్తులు లేవు. గత ఏడాది నవంబర్ 3వ తేదీన హైదరాబాద్ నుంచి యర్రగొండపాలెం వచ్చిన బ్రహ్మాజీ అదే నెల 5వ తేదీన మృతి చెందాడు. ఆ రోజే సర్వే నంబర్ 58/1లోని స్థలాలను దొడ్డపనేని శ్రీనివాసరావుకు బ్రహ్మాజీ గిఫ్ట్ డీడ్ కింద రాసి ఇచ్చాడు. శ్రీనివాసరావు ఈ నెల 18వ తేదీన తన భార్య యోగమ్మ పేరుతో 570 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించాడు. అందులో ఉన్న రేకుల షెడ్డు, మిగిలిన స్థలం శ్రీనివాసరావు స్వాధీనంలో ఉన్నట్లుగా తహసీల్దార్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి సర్వే చేసి ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. రేకుల షెడ్డుకు పన్ను చెల్లిస్తున్నట్లు పంచాయతీ నుంచి బిల్లు కూడా పుట్టించారు. ఇందుకోసం రూ.లక్షల్లోనే ఖర్చు చేసినట్లు ప్రచారం సాగుతోంది. తమ స్థలంతో బ్రహ్మాజీకి ఎలాంటి సంబంధం లేదని, అయినా గిఫ్ట్ డీడ్ చేయడం, అదే రోజు మృతి చెందడంపై అనుమానాలు ఉన్నాయని తిరుమలరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తప్పుడు పత్రాలతో భూమిని కాజేశారని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని విన్నవించాడు. ఈ ఫిర్యాదుపై సమగ్రంగా విచారిస్తామని సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య తెలిపారు. ఇదిలా ఉండగా ధృవీకరణ పత్రాల ఆధారంగానే తాము శ్రీనివాసరావు భార్య పేరుతో రిజిస్ట్రేషన్ చేశామని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు.



వివాదాస్పదంగా మారిన పాడుపడిన మిద్దె



జేసీబీతో పెకలించి ట్రాక్టర్‌లో నింపిన కర్ర

చిట్టడవిలో కర్ర దొంగలు

- చోద్యం చూస్తున్న అటవీశాఖాధికారులు
- వన్య ప్రాణులకు పొంచి ఉన్న ముప్పు

తర్లుపాడు: జింకలు, కుందేళ్లు, నెమళ్లకు ఆలవాలమైన తర్లుపాడు మండలంలోని గానుగపెంట, రాగసముద్రం అటవీ ప్రాంతంలో దొంగలు పడ్డారు. తమకు ఇష్టం వచ్చినట్లుగా అటవీ కర్రను తరలించుకుపోతున్నారు. అధికారికంగా కొంత, అనధికారికంగా మరింత వివిధ రకాల చెట్లను అడ్డంగా నరికేస్తున్నారు. వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న చిట్టడవిలో రేగు, జిట్రేగి, ఇనుమద్ది, గార, జపాన్ తుమ్మ చెట్లు భారీగా ఉన్నాయి. సాధారణంగా అటవీ శాఖ అధికారుల అనుమతి లేకుండా నిషేధిత అటవీ ప్రాంతంలో గడ్డిపోచను పీకినా కేసులు నమోదు చేస్తారు. అలాంటిది గానుగపెంట, రాగసముద్రం గ్రామ శివార్లలో ఉన్న చిట్టడవిలో కర్రను గత వారంరోజులుగా కొంతమంది వ్యక్తులు కూలీలు, జేసీబీల సాయంతో అక్రమంగా తరలించుకుపోతున్నా అటవీ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. వారి ప్రమేయం లేకండా అడవిలోకి జేసీబీని తీసుకొచ్చి చెట్లను కొట్టడం సాధ్యమయ్యే పని కాదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో చిట్టడవుల పాత్ర కీలకం. గ్రామాలకు సమీపంలో ఉండే ఈ చిట్టడివి పశువుల మేతకూ ఉపయోగపడుతుంది. అటవీ భూముల్లోకి తరచుగా పశువులు, గొర్రెలు, మేకలు వెళ్లి గడ్డి మేస్తుంటాయి. గత రెండు వారాలుగా అటవీ సంపదను నరికి తీసుకెళ్తున్నప్పటికీ ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ నరికిన కర్రను పొగాకు బ్యారన్లు, బొగ్గు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ట్రాక్టర్ కర్రను రూ.8 నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు దృష్టి సారించి చిట్టడవిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా యంత్రాలతో చెట్లు పెకలిస్తుండటంతో ఆ ప్రాంతాల్లో తిరిగే జింకలు, దుప్పులు, నెమళ్లు, కుందేళ్లు, ఉడుములు ఇతర ప్రాంతాలకు పలాయనం చిత్తగిస్తున్నాయి.



తరలించేందుకు సిద్ధంగా ఉన్న కర్ర

అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ నరికివేత

- రూ.లక్షలు సొమ్ముచేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

పామూరు: మండలంలోని అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ తోటలను తెలుగు తమ్ముళ్లు యథేచ్ఛగా నరికి లారీల్లో తరలించి రూ.లక్షలు దండుకుంటున్నారు. మండలంలోని పడమటి కట్టకిందపల్లె సమీపంలోని అగ్రిగోల్డ్ భూముల్లో మంగళవారం టీడీపీ అనుచరులు కూలీలను పెట్టి జామాయిల్ కర్రలను కొట్టించారు. ఈ సందర్భంలో గ్రామస్తులు వారిని అడ్డుకోవడంతో వెళ్లిపోయారు. గతంలో టీడీపీ నాయకులు మండలంలోని అనుమునిగిరివద్ద, రేణిండుగు వద్ద అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన జామాయిల్‌ను పెద్ద ఎత్తున కొట్టించి సొమ్ముచేసుకున్నారు. ఈప్రాంతంలో సుమారు 300 ఎకరాలకు పైగా అగ్రిగోల్డ్‌కు చెందిన భూములు ఉన్నాయి. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్యను వివరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందని వెంటనే వీఆర్‌ఓను పంపగా అక్కడ ఎవరూ లేరన్నారు. ఎవరైనా అగ్రిగోల్డ్ భూముల్లోగాని, ప్రభుత్వ భూముల్లోగాని చెట్లను కొడితే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



జామాయిల్ చెట్ల నరికివేతతో ఆనవాళ్లుగా మిగిలిన మొదళ్లు

నలుగురు జూదరుల అరెస్ట్

- డ్రోన్ సాయంతో పేకాట శిబిరం గుర్తింపు
- నిందితుల నుంచి రూ.1,02,000 స్వాధీనం

దర్శి: పేకాట శిబిరాన్ని డ్రోన్ సాయంతో గుర్తించిన పోలీసులు మారువేషాల్లో వెళ్లి దాడి చేశారు. ఈ సంఘటన మంగళవారం దర్శి మండలంలోని జముకుల దిన్నె గ్రామ శివారులో చోటుచేసుకుంది. నలుగురు మాత్రమే పట్టుబడ్డారని, నిందితుల నుంచి రూ.1,02,000 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ రామారావు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామన్నారు. దాడిలో ఎస్సైలు మురళి, రాంబాబు, హెచ్‌సీ శంకర్, పీసీలు గురుబాబు, మహేష్, జిలానీ పాల్గొన్నారు.



మారువేషంలో వెళ్లి జూదరులను పట్టుకున్న పోలీసులు

బాలనాగమ్మా.. నీ పేరు లేదమ్మా!

- సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఐసీడీఎస్ పోస్టులకు ఇంటర్వ్యూలు
- ఆయా పోస్టుకు కాల్ లెటర్ పంపి, పేరు లేదనడంపై గిరిజన మహిళ ఆందోళన

మార్కాపురం: అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకున్న ఓ గిరిజన మహిళకు ఇంటర్వ్యూ కాల్ లెటర్ పంపిన అధికారులు.. తీరా ఆమె మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చాక పేరు లేదని చెప్పారు. దీంతో ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దోర్నాల మండలం తుమ్మలబైలుకు చెందిన దాసరి బాలనాగమ్మ అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆమెను ఈనెల 28వ తేదీన మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని అధికారులు కాల్‌లెటర్ పంపారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆమెను 'నీ పేరు లిస్టులో లేదు' అంటూ వెనక్కు పంపారు. ఇదే విషయాన్ని ఆమె ఎంతో ఆవేదనతో మీడియా ఎదుట చెప్పిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు ఆమెను ఇంటర్వ్యూకు పిలిచి దిద్దుబాటు చర్యలు చేపట్టారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్, ఇతర అధికారులు



మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న బాలనాగమ్మ

ఐసీడీఎస్ పోస్టులకు ఇంటర్వ్యూలు

మార్కాపురం డివిజన్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టులకు మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మార్కాపురం, యర్రగొండపాలెం, బేస్తవారపేట, గిద్దలూరు ప్రాజెక్టుల పరిధిలో 4 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 10 మంది, 3 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు ఏడుగురు, 21 ఆయా పోస్టులకు 52 మంది హాజరయ్యారు. వీరిని సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఐసీడీఎస్ పీడీ హీనా సుజిన్, డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి ఇంటర్వ్యూ చేశారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను ఆయా కేంద్రాల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పరిశీలించారు.

60 మంది విద్యార్థులుంటే ఆదర్శ పాఠశాల

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: పంచాయతీల్లో ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులు ఉంటే వాటిని ఆదర్శ పాఠశాలలుగా మార్చాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. మంగళవారం ప్రకాశం భవనంలో మండల విద్యాధికారులతో పాఠశాలలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియపై ఆరా తీశారు. గతంలో ఉన్న జీఓ 117ను ఉపసంహరిస్తూ జారీ చేసిన మెమో ప్రకారం డెస్క్ వర్క్ పూర్తి చేయాలని చెప్పారు. ఏ ఒక్క పాఠశాల మూతపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలలకు బదిలీ చేసేటపుడు రవాణా భత్యం మంజూరు చేయాలన్నారు. ఎంఈఓలు చేసే డెస్క్ వర్క్‌ను నియోజకవర్గ ప్రత్యేకాధికారులు పరిశీలించి ధృవీకరించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ కిరణ్‌కుమార్, డీవైఈఓలు, ఎంఈఓలు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా